క్లుప్తంగా

సరస్వతీదేవిగా దుర్గామాత



మండవల్లి: స్థానికంగా కొలువుదీరిన శ్రీదుర్గామాత ఆలయంలో అమ్మవారు వసంత పంచమి సందర్భంగా సరస్వతీ దేవిగా సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్యామల నవరాత్రులు పురస్కరించుకుని ఐదో రోజు అమ్మవారిని సరస్వతీ దేవిగా అర్చకులు చాగంటి శ్రీనివాస్ అలంకరించారు.

ఆలయానికి రూ.70వేల విరాళం



పామర్రు: కొండిపర్రు రోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కురుమద్దాలి గ్రామస్తులు వేములపల్లి నారాయణ రావు జ్ఞాపకార్థం కుమారుడు వీవీఎస్ ప్రసాద్ రూ.70వేల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పమిడిముక్కల: ఐనంపూడి శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, వీరాంజనేయస్వామి, గోదా అమ్మవారు, గరుడ మూర్తుల నూతన విగ్రహాలనుప్రతిష్ఠించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

టీడీపీ ఫ్లెక్సీ తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

తోట్లవల్లూరు: యాకమూరు–గరికపర్రు మలుపు వద్ద ఉన్న టీడీపీ ఫ్లెక్సీని పంచాయతీ సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ బ్యానర్ తొలగించటంలో నిర్లక్ష్యం వహించటంపై 'కోడ్ వర్తించదా..?' శీర్షికన 'సాక్షి'లో సోమవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ కేఎస్ రవికాంత్ పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి బ్యానర్ తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

మహిళా వైద్యులకు సత్కారం



గుడివాడ టౌన్: జాతీయ మహిళా వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం మహిళా వైద్యలను సత్కరించారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని లక్ష్మీ సింహాచలం ఆస్పత్రికి చెందిన డాక్టర్ గోర్జి రమాసత్య దివ్య, డాక్టర్ గోర్జి స్వర్ణలతను సత్కరించారు. కార్యక్రమంలో సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, డాక్టర్ గోర్జి పృథ్వీ, జి విజయరాజ్, జి హరిబాబు, అభినయ్ కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



పామర్రు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించే లక్ష్యంతో శృతి హాస్పిటల్‌ను నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక ఫ్లై ఓవర్ బైపాస్ రోడ్డు పక్కన కొండిపర్రు గ్రామ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న శృతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల వైద్య సేవలు ఈ వైద్య శాల ద్వారా అందించాలన్నారు. సుమారు రూ.20 కోట్లతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను పామర్రులో నిర్మించాలనే ఉద్దేశం హాస్పిటల్ యాజమాన్యానికి కలగటం హర్షణీయమన్నారు. సీపీ ఆర్ ఆదిత్య శర్మ, డాక్టర్ కేఎస్ ఎల్ శృతి, వైద్య శాల ఎండీలు కె.సంజయ్ కోటమరాజు, కె.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- జెడ్పీ హైస్కూల్లో 'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- విద్యా సామర్థ్యాల మేరకు గ్రేడ్లుగా విభజన
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి



పామర్రు జెడ్పీ హైస్కూల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పామర్రు: స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. గత ఏడాదిలో వచ్చిన ఫలితాల కన్నా మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు చేస్తున్నారు.

సన్నద్ధం ఇలా..

పాఠశాల్లో 2024–25లో పదో తరగతి పరీక్షలకు 125 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిని నాలుగు గ్రేడులుగా విభజించారు. ఏ గ్రేడ్‌లో 600 నుంచి 550 మార్కులు తెచ్చుకునే సామర్థ్యం ఉన్న వారు. బి గ్రేడ్‌లో కొంచెం మెరుగైన వారు, సీ గ్రేడ్, డీ గ్రేడ్‌లో ఉన్నవారికి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయింత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

15మంది బాధ్యత ఒక ఉపాధ్యాయుడిది

ప్రతి ఉపాధ్యాయుడు 15 మంది విద్యార్థుల బాధ్యతను తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి చదివించేలా చూస్తున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రోజూ సాయంత్రం కొంత మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. గతంలో మెరుగైన ఫలితాలను సాధించామని.. ఈ ఏడాది వాటికంటే ఇంకా ఉన్నతమైన ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పదో తరగతిలో 125 మంది..

2022–23లో 112 మందికి 78 మంది విద్యార్థులు 2023–24లో 125 మందికి 96 మంది ఉత్తీర్ణులయ్యారు. 2024–25 విద్యా సంవత్సరంలో 125 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధ



పాఠశాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో వెనుకబడిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

– హర్షిణి, పదో తరగతి విద్యార్థిని

చాలా ఉపయోగం



పాఠశాల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులతో చాలా ఉపయోగం ఉంది. అడిగిన ప్రతి డౌట్‌ను క్లారిఫై చేస్తున్నారు. ఇళ్లను కూడా సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. రోజూ నిర్వహించే పరీక్షల్లో వచ్చే మార్కులు, చదివే విధానంపై చర్చిస్తున్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషితో ఉత్తమ మార్కులు సాధిస్తాం.

– సత్యసాయి గోపినాథ్, పదో తరగతి విద్యార్థి

ఉత్తమ ఫలితాల కోసం ప్రయత్నం



ఒక ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయులందరం కలిసి శ్రమిస్తూ ఉత్తమ ఫలితాల కోసం ప్రయత్నిస్తున్నాం. ఈ ఏడాది హైస్కూల్లో ఉన్న 125 మందికి 125 మంది విద్యార్థులు ఉత్తీర్ణలయ్యే విధంగా ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాం. నూటికి నూరుశాతం ఫలితాలే లక్ష్యంతో తగు విధమైన కృషి చేస్తున్నాం.

– ఇందిరారాణి, హెచ్‌ఎం, పామర్రు హైస్కూల్

సులభ పద్ధతిలో బోధన




పమిడిముక్కల: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణ కుమారి ఉపాధ్యాయులకు సూచించారు. పెనుమత్స ప్రాథమికోన్నత పాఠశాల్లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం, కూర నాణ్యతగా లేకపోవడంతో రుచిగా చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, హెచ్‌ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి అంబేడ్కర్ నగర్ కాలనీలో డ్రెయిన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కాలనీలో ఈ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందు కోసం జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు కేటాయించినట్లు సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ తెలిపారు. కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగునీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఇళ్ల ముందే నిలిచిపోతుంది. ఇలాంటి తరుణంలో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టడంపై స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..



మామిళ్లపల్లి సరస్వతీదేవి అమ్మవారు

ఘనంగా వసంత పంచమి వేడుకలు

పమిడిముక్కల: జిల్లాలో ప్రసిద్ధి గావించిన మామిళ్లపల్లి సరస్వతీదేవి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించి 'సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి..' అంటూ పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిన్నారులకు మాతాసుజ్ఞానందగిరి అమ్మవారు అక్షరాభ్యాసాలు చేయించారు.

పామర్రులో..

అడ్డాడ(పామర్రు): పామర్రు మండలం అడ్డాడ గ్రామంలోని అరవింద హైస్కూల్ ఆవరణలో వసంత పంచమిని పురస్కరించుకుని చిన్నారుల చేత సామూహికంగా అక్షరాభ్యాస కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమణమూర్తి పాల్గొన్నారు.

మొవ్వలో..

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదముత్తేవి ఎస్.ఎల్.ఎస్.వి.వి.ఎస్ ఓరియంటల్ పాఠశాల్లో విద్యార్థులు చదువుల తల్లి విగ్రహానికి పూజలు నిర్వహించారు. పూర్వపు హెచ్‌ఎం కోసూరు ఆదినారాయణ రావు, కరస్పాండెంట్ సుచిస్మిత, హెచ్ ఎం కే మాధవి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



సరస్వతీదేవి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం



అడ్డాడలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



పెదముత్తేవిలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

ముళ్ల పొదల తొలగింపు



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజలోని పంట కాలువల పూడికలు, వీటిపై ఉన్న ముళ్ల పొదల తొలగింపు పనులను సోమవారం చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ మంచాల సరస్వతి, వైఎస్సార్ సీపీ నేతలు పర్యవేక్షించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ముదినేపల్లి రూరల్: మండలంలోని వాడవల్లి యూపీ స్కూల్లో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గురజ పీహెచ్‌సీకి చెందిన సిబ్బంది ఆధ్వర్యంలో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి, నివారణకు మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీలో అగినపర్రు విద్యార్థినుల సత్తా



పమిడిముక్కల: పమిడిముక్కల హైస్కూల్లో జరిగిన సబ్‌జోన్ ఆటల పోటీల్లో అగినపర్రు హైస్కూల్ విద్యార్థినులు సత్తా చాటారు. జూనియర్ కబడ్డీ పోటీలో ద్వితీయ స్థానం సాధించారు. హైస్కూల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో కబడ్డీ జట్టును, శిక్షణ ఇచ్చిన ఇన్‌చార్జి పీఈటీ రవిబాబును హెచ్‌ఎం ఫణికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

శివరాత్రి పనులు ప్రారంభం

కైకలూరు: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కలిదిండి స్వయంభు శ్రీపాతళ భోగేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు శివరాత్రి మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్ సోమవారం తెలిపారు. పందిరి రాట ముహుర్తం అయిలూరి మల్లిబాబుతో నిర్వహించామని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి



అనుబంధ విభాగాల అధ్యక్షులతో డీఎన్నార్

కైకలూరు: క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సూచించారు. ఇటీవల నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన పాము రవి కుమార్(ప్రచారం విభాగం), గుడివాడ రాజ సత్యప్రసాద్ (పంచాయతీ రాజ్ విభాగం), కూరేళ్ల మరియమ్మ (అంగన్‌వాడీ విభాగం), దొంతు యజ్ఞ నారాయణ (బూత్ కమిటీ) వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డీఎన్నార్‌ను కలిసి పదవులు కేటాయించినందుకు సోమవారం అభినందనలు తెలిపారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, కైకలూరు, మండవల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు శింగంశెట్టి రాము, బేతపూడి ఏసేబురాజు, నాయకులు చిట్టూరి మురళి, బోనం శేషగిరి, సత్యనారాయణ, పెరుమళ్ల లక్ష్మీకాంతమ్మ, పేరే రామకృష్ణ, కురెళ్ల సుబ్రహ్మణ్యం, వల్లూరి బుల్లయ్య, కులవర్తి నందిబాబు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రి నిర్మిస్తాం

సద్గురు మధుసూదన్‌సాయి



మాట్లాడుతున్న సద్గురు మధుసూదన్‌సాయి

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి తమవంతు కృషి చేయనున్నట్లు గ్లోబల్ హ్యుమానిటేరియన్ మిషన్ వ్యవస్థాపకులు సద్గురు శ్రీమధుసూదన్‌సాయి తెలిపారు. తోట్లవల్లూరులో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని సద్గురు మధుసూదన్‌సాయి దర్శించుకుని పూజలు నిర్వహించారు. జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సత్యసాయి వందేళ్ల జన్మదిన వేడుకలు రానున్న నేపథ్యంలో ఏడాదిలో ప్రభుత్వం, గ్రామస్తుల సహకారంతో ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఆస్పత్రి నిర్మాణానికి ముందుకు వచ్చిన సద్గురు శ్రీమధుసూదన్‌సాయిని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అభినందించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వీరపనేని శివరాం, పెద్ది పాపారావు, హెచ్‌ఎం ఫణి రాజమోహన్ పాల్గొన్నారు.

ఫార్మసీ అధ్యాపకుడి ప్రతిభ



బహుమతిని అందుకుంటున్న నాగూల్ మీరా

గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీ అధ్యాపకుడు ఎస్‌కే నాగూల్ మీరావలీ ఓరల్ ప్రెజెంటేషన్‌లో తృతీయ స్థానం సాధించారు. ఈ విషయాన్ని సోమవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. గత నెల 30నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నాగూల్ మీరావలీ తలపడ్డారన్నారు. ఈ పోటీలో కొబ్బరి చెట్ల వేర్లను మూర్ఛ చికిత్సకు ఉపయోగించటంపై ఓరల్ ప్రజెంటేషన్‌ను అందించి తృతీయ స్థానాన్ని గెలుపొందారని తెలిపారు. విజేతను అధ్యాపకులు అభినందించారు.

వైన్ షాపుల దరఖాస్తుకు నేడు తుది గడువు

గుడ్లవల్లేరు: గీత కార్మికుల వైన్ షాపుల దరఖాస్తులకు మంగళవారం సాయంత్రం ఐదు గంటలతో గడువు ముగియనుందని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ సోమవారం తెలిపారు. గీత కార్మికులకు రెండు వైన్ షాపులను గుడివాడ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. గుడివాడ రూరల్ – ఒకటి, గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో మరొక షాపు మంజూరైనట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేక ఆఫ్‌లైన్‌లో అయినా స్వీకరిస్తారని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ, నేటివిటీ సర్టిఫికెట్స్‌ను దరఖాస్తుతో పాటు జత చేయాలని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు రూ.2లక్షల నాన్ రీఫండబుల్ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులకు దరఖాస్తుల స్వీకరణకు ఆహ్వానిస్తున్నామని సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఆటల పోటీల్లో విజేతలకు అభినందన



పామర్రు: గ్రిగ్ మెమోరియల్ బాలికల సబ్ జోన్ ఆటల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు ఉవిజేతలుగా నిలిచారని పామర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఏ ఇందిరాణి తెలిపారు. స్థానిక ఎస్‌కేఆర్ ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విజేతలను సోమవారం అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు రవికిషోర్, మురళిని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఓవరాల్ చాంపియన్స్‌గా మొవ్వ విద్యార్థులు



మొవ్వ: గ్రిగ్ మెమోరియల్ పామర్రు సబ్ జోన్ బాల బాలికల ఆటల పోటీల ఓవరాల్ చాంపియన్స్‌గా మొవ్వలోని శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం సూర్యదేవర శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాల్లో విజేతలను అభినందనలు తెలియజేశారు. శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్స్ అప్పికట్ల రామారావు, మండలి మనోహరిని ఉపాధ్యాయులు జాకీర్ అహ్మద్, పసుపులేటి శివ కోటేశ్వరరావు అభినందించారు.

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట



గుడ్లవల్లేరు: స్థానిక శ్రీమద్ఘంగా పార్వతీ దేవి సమేత సిద్ధేశ్వరాలయంలో పంచలోహ సరస్వతీ దేవి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. ఆలయంపై కలశాల స్థాపనను వేద పండితులు నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు తొలుత ఆలయ చైర్మన్ కొసరాజు పెదబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి ఈ పూజల్లో పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో తమిరిశ విద్యార్థినుల విజయం

నందివాడ: గత నెల 23, 24, 31, ఈ నెల ఒకటో తేదీన జరిగిన గుడివాడ సబ్ జోన్ ఆటల పోటీల్లో తమిరిశ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎమ్‌ఈఓ డేవిడ్ రత్నరాజు చేతుల మీదుగా మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.



ఇళ్ల హక్కుదారులకు కార్డులు



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సారథి

గుడ్లవల్లేరు: స్వమిత్వ సర్వే ద్వారా ఇళ్లను సర్వే చేయటమే కాకుండా హక్కుదారులకు కార్డులను అందించనున్నట్లు ఎంపీడీఓ టి.వి జయ సారథి అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గ్రామ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి పన్నుల వసూళ్లను చేయాలన్నారు. మండలంలోని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మార్చి లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు సమన్వయ కమిటీ సమావేశం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో మార్చి 1 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు పెద్దింట్లమ్మ జాతర (తీర్థం)పై సమన్వయ కమిటీ సమావేశం కైకలూరు తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ సభకు ఉత్సవ కమిటీ చైర్మన్, ఏలూరు ఆర్డీఓ డాక్టర్ అచ్యుత్ అంబరీష్ హాజరవుతారని పేర్కొన్నారు.